క్లుప్తంగా

చెరుకుమిల్లిలో జాతర సందడి



వేంకటేశ్వర కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో పోలేరమ్మ, మారమ్మ, భద్రకాళి అమ్మవార్ల జాతరలో భాగంగా ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల జాతర ఉత్సవాలను 29 వరకూ నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతర మహోత్సవం సందర్భంగా ఆఖరి రోజు అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



గరగపర్రులో మాట్లాడుతున్న డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి

పాలకోడేరు: ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని భరోసా కలిస్తూ పోలీసులు ఆదివారం విస్సాకోడేరులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జరగబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. భీమవరం డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి, సీఐ వై.సత్య కిషోర్, పాలకోడేరు ఎంపీడీవో అనూహ్య, ఎస్సై ఎస్.శ్రీనివాస రావు మండలంలోని విస్సాకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల కూడళ్ల వద్ద ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వేసవిలో రెండు పూటలా మంచినీటి సరఫరా

నరసాపురం: వేసవిలో పట్టణ వాసులకు రెండు పూటలా సమృద్ధి గా మంచినీటి సరఫ రా చేయాలని నిర్ణయించామని మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపామన్నారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువునిండా నీరు ఉండే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. 14 అడుగలు మేర నీటి నిల్వ ఉంటుందన్నారు. కాలువలు కట్టేసిన తరువాత 60 రోజుల పాటు రెండుపూటలా కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడినా వెంటనే మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

250 మందికి ఉచిత రక్తనాళ పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఏసియన్ వాస్కులర్ హాస్పటల్స్ సహకారంతో ఆదివారం ఉచిత రక్తనాళ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ రక్త నాళాల వైద్య నిపుణుడు డాక్టర్ జీవీ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సోమాచార్యులు 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి 40 మందికి లేజర్ ట్రీట్‌మెంట్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా ట్రీట్‌మెంట్ చేస్తారమని వివరించారు. హైదరాబాద్‌లో ట్రీట్‌మెంట్ చేసేందుకు ప్రయాణ ఛార్జీలను కూడా తమ సంస్థ భరిస్తుందని డాక్టర్ సోమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో గుడిమెట్ల బాలగంగాధర్‌రెడ్డి, దండు రామరాజు, గాదిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో తోకలపూడి ఆదర్శం

- గ్రామంలో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు
- ప్రభుత్వ పథకాలతో లబ్ధిదారులకు సాయం

వీరవాసరం: గ్రామ సీమల పురోభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యం అవుతుందని తోకలపూడి గ్రామంలో అభివృద్ధి చూస్తే అర్థమవుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనుల వల్ల వీరవాసరం మండలంలోని తోకలపూడి గ్రామం ఎంతో పురోభివృద్ధితో ముందుకు దూసుకెళ్తోంది. ఎన్నడూ లేని విధంగా తోకలపూడి గ్రామంలో గ్రామ సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు, అంతర్గత రహదారులు, సీసీ రహదారుల నిర్మాణం, హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల పురోగతి ఇంటింటికీ మంచినీటి సరఫరా వంటి పనులు పూర్తయ్యి కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తోకలపూడి గ్రామం అభివృద్ధికి మచ్చుతునకలా నిలుస్తుంది.

అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి ఇలా

గ్రామంలో జగనన్న అమ్మఒడి ద్వారా 227 మందికి లబ్ధి చేకూరింది. జగనన్న విద్యా దీవెన 84 మంది, జగనన్న వసతి దీవెన 65, వైఎస్సార్ రైతు భరోసా 205, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా 15, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు రైతులకు 86, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ 92, వైఎస్సార్ పింఛన్ కానుక 304, వైఎస్సార్ చేయూత 118, వైఎస్సార్ ఆసరా 332, వైఎస్సార్ సున్నా వడ్డీ ఎస్‌హెచ్‌జీ 441, వైఎస్సార్ కాపు నేస్తం 65, వైఎస్సార్ ఈబీసీ నేస్తం 02, వైఎస్సార్ కళ్యాణమస్తు 2, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 65, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా 42, హౌసింగ్ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు 26, వైఎస్సార్ బీమా 4, వైఎస్సార్ వాహన మిత్ర 5, జగనన్న చేదోడు 5, వైట్ కార్డ్ హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్ సాయం 593, జగనన్న తోడు వడ్డీ 105, ఇళ్ల స్థలాలు భూసేకరణ పరిహారం చెల్లింపు 30, జగనన్న విద్యా కానుక 138, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ 09, జగనన్న తోడు రుణాలు 119, జగనన్న గోరుముద్ద 143, వైఎస్సార్ సంపూర్ణ పోషణ 149, ఇంటింటికి రేషన్ 659, మొత్తం లబ్ధిదారులు 4137, మొత్తం లబ్ధి రూ.11,07,79,521 చేకూరింది



తోకలపూడి సచివాలయం



తోకలపూడిలో నిర్మించిన సీసీ డ్రెయిను, రోడ్డు



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజా సేవలో ముందుంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్ రెడ్డి పరిపాలనలో గ్రామపంచాయతీ సర్పంచిగా పనిచేయడం నాకు ఎంతో సంతృప్తిని ఇస్తుంది. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే గ్రామాల్లో అంతర్గత సీసీ రహదారుల నిర్మాణం పూర్తి చేశఋాం. సుమారు 50 ఏళ్లుగా లేని కల్వర్టు నిర్మించి, సీసీ రహదారి కూడా నిర్మించాం.

– వీరవల్లి శ్రీనివాసరావు, సర్పంచ్

అన్ని వర్గాలకు సమన్యాయం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో గ్రామంలో ఎప్పుడు లేనటువంటి అభివృద్ధి పనులు జరిగాయి. జగనన్న లే అవుట్‌లో ఇళ్లస్థలం లభించడంతో త్వరలోనే ఇంటి నిర్మాణం మొదలుపెడతాను. నాకు వైఎస్సార్ చేయూత, డ్వాక్రారుణాలు మాఫీ తదితర ఐదేళ్ల కాలంలో సుమారు రూ.4.లక్షల మేరకు లబ్ధి చేకూరింది.

– చెల్లబోయిన సత్యవతి, తోకలపూడి

ఉండి ఎమ్మెల్యేగా పీవీఎల్ గెలుపు ఖాయం



రవిరాజు

కాళ్ల: ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడం ఖాయమని, ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహారాజు గెలుపు ఖాయమని కోపల్లే సొసైటీ మాజీ చైర్మన్ వేగేశ్న రవిరాజు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పీవీఎల్ నరసింహారాజు నిత్యం ప్రజల్లో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రభుత్వం నుంచి నిధులను పెద్ద ఎత్తున రాబట్టి గ్రామాల్లో మౌలికలు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. మహిళలే పార్టీకి అండ అని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని కాట్రేనిగుంటకు చెందిన షేక్ అల్తాఫ్(27) చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు, అతని భార్య విడివిడిగా ఉంటున్నారు. మనస్తాపంతో 22న గడ్డిమందు తాగాడని, చికిత్స నిమిత్తం భీమవరం, తణుకు, ఏలూరు అనంతరం కాకినాడ తరలించారన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఏబీఎస్‌వీకేలో బాలలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తమ సంస్థ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలను పరీక్షిస్తారని తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకు 99490 93115 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన స్కూల్ బస్సు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఓ ద్విచక్ర వాహనాన్ని స్కూల్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా చిన్న గొల్లపాలేనికి చెందిన భూసారపు నాగసాయి, కాళ్ల మండలంలోని పెదమిరం గ్రామంలో ఆక్వా మెడిసిన్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 23న మొగల్తూరు నుంచి తన స్నేహితుడు దేవర నరేష్ తో ద్విచక్ర వాహనంపై భీమవరం వస్తుండగా డేగాపురం వచ్చేసరికి ఎదురుగా ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగసాయి నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. నాగ సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు అదృశ్యమయ్యాడని తండ్రి ఫిర్యాదు

ఉండి: తన కొడుకు కనిపించడంలో లేదని ఆదివారం ఓ తండ్రి ఉండి పోలీసులను ఆశ్రయించాడు. వివరాల ప్రకారం మండలంలోని యండగండి గ్రామానికి చెందిన నిర్జోగి వెంకట సత్యనారాయణ కుమారుడు మహేష్ భీమవరంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మహేష్ స్నేహితులతో పాటు బంధువల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనంలో లేకపోవడంతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

వైభవంగా మట్టల ఆదివారం

ఉండి: మనుషుల్లో తగ్గింపు స్వభావం ఉండాలని చెప్పేందుకు ప్రతీకగా మట్టల ఆదివారం నిలుస్తుందని ఉండి ఎన్నార్పీ అగ్రహారం ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని లూథరన్ క్రైస్తవ సంఘాల్లో క్రైస్తవులు పెద్ద ఎత్తున ఈత మట్టలను పూలతో అందంగా అలంకరించి వాటిని పట్టుకుని ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యంగా ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్,ఉండి పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్‌ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున క్రైస్తవులు తరలివచ్చి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సీఆర్ పాలమూరి కరుణాకర్ రావు, సంఘ పెద్దలు గుమ్మడి అమృతరావు, ఆలమూరి శ్యాంబాబు, చుక్కా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులంతా మట్టల ఆదివారం పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులంతా ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారు. ఉదయం నుంచి మట్టలకు పూలు అలంకరించి క్రైస్తవులు క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం క్రైస్తవుల ప్రార్థనా మందిరాలు వద్ద మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శృంగవృక్షం పెదపేటలో ఉన్న జెరుషలేం ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ రాజ్ మలాకి, సంఘ పెద్దలు, సంఘస్తులు యూత్ సభ్యులు సండే స్కూల్ విద్యార్థులు, స్త్రీల సమాజం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు.



పాలకోడేరు: పెద్దపేట ఎరుషలేం ప్రార్థన మందిరం వద్ద మట్టలతో సంఘస్తులు



కాళ్ల: జువ్వలపాలెం గ్రామంలో మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఉండి: పెదపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ వద్ద మట్టల ఆదివారం నిర్వహిస్తున్న చిన్నారులు

ఉమా వైద్యనాథేశ్వరస్వామికి జ్యోతిర్లింగార్చన



జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు

యలమంచిలి: పెనుమర్రు గ్రామంలోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సోమవారం గ్రామ బలిహరణ, త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహిస్తామని ఈఓ ఎన్.సతీష్‌కుమార్ వివరించారు. కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వహించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని ఆలయ నిర్మాత పాత్తూరి సోమరాజు తెలిపారు.

శృంగవృక్షంలో రామాలయ ప్రతిష్ఠ

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షవంలోని రావుచెరువు గట్టున ఆదివారం మహాగణపతి హనుమద్ లక్ష్మణ సీతా సమేత శ్రీ కోదండరామాల, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్ఛారణలు మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు నిర్మాణాలు వల్ల గ్రామాల సుభిక్షంగా ఉంటాయన్నారు.

అలుగులమ్మను దర్శించుకున్న పీవీఎల్

ఉండి: మండలంలోని చెరుకువాడలో అలుగులమ్మ వారి జాతర మహోత్సవాల నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనా కార్యక్రమాన్ని పీవీఎల్ స్వయంగా వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

దివ్యాంగులకు వీల్ ఛైర్స్ అందజేత

భీమవరం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా భీమవరం పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఇద్దరు దివ్యాంగులకు వీల్ ఛైర్స్ అందజేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ కె.నాగశయనరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో సేవలు అందిస్తూనే, సమాజానికి కూడా తమ వంతు చేయూతను అందిస్తూ, ప్రతి సంవత్సరం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భీమవరం భారతీయ స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.గురవయ్య ఆధ్వర్యంలో భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహించామన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు టి.సుబ్రహ్మణ్యం, టి.వెంకటరత్నం, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండల శాఖ అధ్యక్షుడు ఎ.వీరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్ ఛైర్స్ అందిస్తున్న దృశ్యం

వేగంగా దానమ్మ ఆలయ నిర్మాణం

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో కోటిన్నర రూపాయల వ్యయంతో పునర్నిర్మిస్తున్న దానమ్మ ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 28న ఉదయం 8 గంటలకు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 26, 27 తేదీల్లో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి, 28న నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి, ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

27న మార్కెట్ పన్ను వసూళ్ల వేలం

నరసాపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీలో డైలీ మార్కెట్ పన్ను వసూళ్లపై హక్కులు కల్పించేందుకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటదారులు సిండికేట్ కావడంతో ఇప్పటికే వేలం ఓ దఫా వాయిదా పడడం పాఠకులకు విదితమే.

వైభవంగా చండీహోమం

పెనుగొండ: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వాసవి మాత కొలువైన పెనుగొండ క్షేత్రంలోని శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్దని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ‘చండీ హోమం’ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వడగం సత్యనారాయణమూర్తి బ్రహ్మత్వంలో కనుల పండువగా నిర్వహించిన ఈ చండీ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతా పాలిటెక్నిక్ వార్షికోత్సవం

భీమవరం: సాంకేతిక రంగాల్లో విద్యనభ్యసించిన వారికి రానున్న కాలంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి రానున్నాయని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు అన్నారు. పట్టణంలోని బి.సీతా పాలిటెక్నిక్ 27వ వార్షికోత్సవం కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ ఇండియా ఐఈఎస్ 5వ ర్యాంకర్ చినమిల్లి శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థికంగా ఎన్ని ప్రతికూలతలు ఉన్నా లక్ష్య సాధనలో గమ్యం చేరడానికి విద్య ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా శివన్నారాయణను సత్కరించారు. అనంతరం విద్యార్థుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ జె.ప్రసాదరాజు, ఏజీఎం రమేష్‌రాజు, సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీతా పాలిటెక్నిక్ వార్షికోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

జీవితాలు నాశనం చేసుకోవద్దు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పెనుగొండ: కులాలను కించపరుస్తూ, అసభ్యకరమైన పోస్టులను సోషల్ మీడియాలో పెడుతూ జీవితాలు నాశనం చేసుకోవద్దని నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం ఆచంట పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో కులాన్ని కించపరుస్తూ, అసభ్యకరంగా పోస్ట్ చేసిన ఆచంట మండలం శేషమ్మ చెరువుకు చెందిన పిల్లి సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు, ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక కులాన్ని కించపరుస్తూ పోస్టు చేయడంతో స్క్రీన్ షాట్ వేరే గ్రూపుల్లో షేర్ చేయడంతో వైరల్ అయ్యిందని తెలిపారు. దీనిపై ఆచంట మండలం కోడేరుకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సరేళ్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని వివరించారు. ఈ మేరకు పిల్లి సంతోష్‌కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఎవరైనా కులాలను, మతాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో కానీ, మరే ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో గానీ పోస్టులు పెడితే వారిపై చట్టారీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నిక నియమావళి అమలులో ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ కాశీచరణ్, ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

నరసాపురం: ఏ మాత్రం అనుమానం ఉన్నా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని, నరసాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ అన్నారు. ఆసుపత్రిలో ఆదివారం క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ ఆగకుండా దగ్గు, కఫం ఉండటం, బరువు తగ్గడం వంటి సూచనలు కనిపిస్తే కచ్చితంగా కఫం పరీక్ష చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ క్షయ అని నిర్ధారణైతే ఆరు నెలలు మందులు వాడితే క్షయ తగ్గుతుందని చెప్పారు. ఐసీటీసీ మెడికల్ కౌన్సెలర్ జి.జేసుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. క్షయ వ్యాధిని అంతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com